వేతనాలు ఎప్పుడో..?

- కాంట్రాక్టర్‌కు సొమ్ము చెల్లింపులో ప్రభుత్వం జాప్యం
- సమస్యగా మారిన చెత్త తరలింపు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో చెత్త తరలింపు అతిపెద్ద సమస్యగా మారింది. తడిచెత్త–పొడి చెత్త తరలించే వ్యాన్‌ డ్రైవర్లకు సకాలంలో ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో వ్యాన్‌ డ్రైవర్లు సమ్మె బాటపడుతున్నారు. దీంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. వివరాల్లోకి వెళితే.. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ ఏర్పడిన తర్వాత తడిచెత్త–పొడిచెత్త కాన్సెప్ట్‌ చేపట్టారు. ప్రతి ఇంటి వద్ద సేకరించిన చెత్త నుంచి సంపద తయారు చేస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా తడి చెత్త–పొడి చెత్త సేకరించడానికి ప్రత్యేక వ్యాన్లు ఏర్పాటు చేశారు. తొలుత ఈ పద్ధతి బాగానే అమలు జరిగినా ఆ తర్వాత ఆచరణలో అట్టర్‌ ఫ్లాప్‌ అయ్యింది. తడిచెత్త–పొడి చెత్త వేరువేరుగా సేకరించడం సాధ్యపడటం లేదు. చెత్త నుంచి సంపదను సృష్టించే మాట ఎలా ఉన్నా తాడిగడప మున్సిపాలిటీకి మాత్రం నిధుల ఖర్చు భారంగా మారింది.

అసలేమి జరుగుతోందంటే..

క్లీన్‌ ఏపీలో భాగంగా (క్లాప్‌) ప్రతి ఇంటి వద్ద తడి చెత్త–పొడి చెత్త సేకరించడానికి 42 వాహనాలు తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని యనమలకుదురు, కానూరు, తాడిగడప, పోరంకి ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. చెత్త వ్యాన్లకు 42 మంది డ్రైవర్లు ఉన్నారు. తాడిగడప మున్సిపాలిటీ ప్రతి వ్యాన్‌కు నెలకు రూ. 52 వేల చొప్పున 42 వ్యాన్లకు నెలకు రూ. 21,84,000 సొమ్ము నేరుగా కమిషనర్‌ అండ్‌ డైరెక్టర్‌ మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌కు (సీడీఎంఏ) జమచేస్తుంది. అక్కడ నుంచి నిధులు వ్యాన్లు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం బిల్లు ఇవ్వాల్సి ఉంటుంది. వ్యాన్‌ డ్రైవర్ల జీతాలు, వ్యాన్‌ నిర్వహణ, ఇతర ఖర్చులు మొత్తం కాంట్రాక్టర్‌ భరించాలి. వ్యాన్‌ డ్రైవర్లకు కటింగ్‌లు పోనూ నెలకు రూ. 12,500 చొప్పున జీతాలు ఇస్తున్నారు. పీఎఫ్‌, ఈఎస్‌ఐ కాంట్రాక్టర్‌ చెల్లించాలి. అయితే పీఎఫ్‌, ఈఎస్‌ఐపై వ్యాన్‌ డ్రైవర్లకు సక్రమంగా చెల్లిస్తున్నారా లేదా సరైన సమాచారం లేదు.



తాడిగడప మున్సిపాలిటీలో నిలిపి ఉంచిన చెత్త తరలించే వ్యాన్లు

అసలు కథ ఇక్కడే..

కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసలు కథ మొదలైందని చెబుతున్నారు. తాడిగడప మున్సిపాలిటీ ప్రతి నెలా వ్యాన్ల బిల్లు సీడీఎంఏ ఖాతాకు చెల్లించిన తర్వాత వ్యాన్లు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌కు పేమెంట్‌ ఇవ్వాలి. అయితే ఇక్కడే లుకలుకలు ఉండటంతో కాంట్రాక్టర్‌కు బిల్లులు సకాలంలో ఇవ్వడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. దీంతో కాంట్రాక్టర్‌ వ్యాన్‌ డ్రైవర్లకు మూడు నెలలకు ఒకసారి జీతాలు ఇస్తున్నారు. దీంతో వ్యాన్‌ డ్రైవర్లు జీతాల కోసం సమ్మె బాట పడుతున్నారు. చెత్త వ్యాన్లు తిరగకపోవడంతో మున్సిపాలిటీ ప్రాంతంలో చెత్త కుప్పలుగా పేరుకుపోయి పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. గత రెండు నెలలుగా వ్యాన్‌ డ్రైవర్లకు జీతాలు ఇవ్వనందున ఈ నెల 16వ తేదీ నుంచి సమ్మెకు వ్యాన్‌ డ్రైవర్లు సిద్ధంగా ఉన్నారు. సమ్మె ప్రారంభమైతే మున్సిపాలిటీ ప్రాంతంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తాయి.

జీతాలు నేరుగా ఇవ్వాలి



చెత్త తరలించడానికి ఎంతో కృషి చేస్తున్నాం. మాకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మున్సిపాలిటీ నేరుగా మాకు జీతాలు ఇస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

– మస్తాన్‌వలి, వ్యాన్‌ డ్రైవర్‌, తాడిగడప

క్లుప్తంగా

తిరుపతి ఘటనకు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణం

వైఎస్సార్‌ సీపీ పెనమలూరు సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి



పెనమలూరు: తిరుపతిలో భక్తుల మరణానికి కారణం కూటమి ప్రభుత్వ తప్పిదమేనని వైఎస్సార్‌ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఆరోపించారు. ఆయన గురువారం కానూరులో మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశికి లక్షలాది మంది భక్తులు వస్తారని అందరికీ తెలిసిందేనన్నారు. అయితే కూటమి ప్రభుత్వం, టీటీడీ పాలక మండలి నిర్లక్ష్యం కారణంగానే అమాయక భక్తులు మృత్యువాత పడ్డారని విమర్శించారు. జగనన్న పాలనలో ఏనాడూ ఇలాంటి ఘటనలు జరగలేదని, చంద్రబాబు సీఎం అయిన తర్వాత చరిత్రలో మొట్టమొదటిసారిగా తిరుపతిలో అపచారం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై సిట్టింగ్‌ న్యాయమూర్తితో విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. మృతి చెందిన భక్తులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

సీపీఐ శత వార్షికోత్సవ పోస్టరు ఆవిష్కరణ



కంకిపాడు: కంకిపాడులోని సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన జిల్లా నేతల సమావేశంలో పార్టీ శత వార్షికోత్సవ వేడుకల పోస్టరును ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి టి. తాతయ్య, రాష్ట్ర నాయకుడు వెలగపూడి ఆజాద్‌, రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యుడు నార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేదలకు అండగా కమ్యూనిస్టు పార్టీ నిలుస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాల్లో ముందుండి పోరాటం సాగిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ పెనమలూరు నియోజకవర్గ కార్యదర్శి మున్నంగి నరసింహారావు, ట్రేడ్‌ యూనియన్‌ రాష్ట్ర నేత మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, నాయకులు పోతురాజు నాగేశ్వరరావు, వీరాబత్తిన బాలస్వామి, బండి వెంకటరత్నం, పాశం రవికుమార్‌, యలమంచిలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వీల్‌చైర్‌ వితరణ



గన్నవరం: కండరాల వ్యాధితో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న పాలపర్తి ప్రమోద్‌కు గన్నవరం మానవత స్వచ్ఛంద సంస్థ రూ. 40 వేలు విలువైన షిఫ్టింగ్‌ వీల్‌చైర్‌ను గురువారం అందజేసింది. నడవలేని స్థితిలో ఉన్న తనకు అండగా నిలిచిన మానవత సంస్థ ప్రతినిధులకు ప్రమోద్‌ కృతజ్ఞతలు తెలియజేశారు. సంస్థ అధ్యక్షుడు ఎం. బాలకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్‌, సహాయ కార్యదర్శి వీసం ప్రసాదరావు, సభ్యుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి ఆట వస్తువులు బహూకరణ



గన్నవరం: స్థానిక మండల పరిషత్‌ కార్యాలయం ఆవరణలో భవిత కేంద్రానికి గురువారం పీఏసీఎస్‌ మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబు రూ. 35 వేలు విలువైన రంగుల రాత్నం, జారుడుబల్లను బహూకరించారు. వీటిని వైస్‌ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్‌ చేతుల మీదుగా భవిత కేంద్రం టీచర్లకు అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌ మాట్లాడుతూ.. భవిత కేంద్రంలో చదువుకునే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకురావాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు మద్దినేని వెంకటేశ్వరరావు, ఎంఈఓ–1 కె. రవికుమార్‌, ఎంఈఓ–2 ఎం. కమల, సిల్వర్‌జూబ్లీ స్కూల్‌ హెచ్‌ఎం ఎ. ఝాన్సీ, రిసోర్స్‌ టీచర్స్‌ పి. శ్రీనివాసరావు, ఎస్‌. రోజారాణి పాల్గొన్నారు.

పట్టపగలే దుకాణాల్లో చోరీలు

హనుమాన్‌జంక్షన్‌ రూరల్‌: పట్టపగలు వరుస చోరీలతో దుండగులు హనుమాన్‌జంక్షన్‌ వాసులను బెంబేలెత్తిస్తున్నారు. స్థానిక విజయవాడరోడ్డులో మేడపైన ఉన్న రెండు వేర్వేరు దుకాణాల్లో ఒకే వ్యక్తి మధ్యాహ్న సమయంలో చోరీలకు పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజ్‌ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్‌ చేస్తోంది. మధ్యాహ్నం వ్యాపారులు భోజనానికి వెళ్లిన తరుణంలో గుట్టుచప్పుడు కాకుండా దుకాణం తాళాలు తీసి లోపలికి వెళ్లుతున్నారు. జనసంచారం లేకుండా ఉండేందుకు మేడపైన ఉండే షాపులను దుండగులు ఎంచుకోవడం విశేషం. ఈ వరుస చోరీ ఘటనలతో వ్యాపారులు భయాందోళనలకు గురవుతున్నారు. అయితే ఈ చోరీలపై పోలీసులకు ఇప్పటి వరకు ఒక్క ఫిర్యాదు కూడా చేయకపోవడం గమనార్హం.

ఇసుక లారీలకు వ్యతిరేకంగా ధర్నా

పెనమలూరు: వణుకూరు గ్రామస్తులు ఇసుక లారీలు గ్రామంలో ప్రయాణించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నాకు దిగారు. దీంతో గ్రామంలో బుధవారం అర్ధరాత్రి తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాల్లోకి వెళితే.. రొయ్యూరు, తోట్లవల్లూరు ప్రాంతాల నుంచి భారీ లారీల్లో ఓవర్‌ లోడ్‌తో ఇసుక తరలింపు జరుగుతోంది. లారీలు అర్ధరాత్రి విజయవాడ–అవనిగడ్డ కరకట్ట నుంచి మద్దూరు, వణుకూరు మీదుగా బందరు రోడ్డుకు వెళుతున్నారు. అయితే లారీలు పెద్ద సంఖ్యలో వణుకూరు గ్రామంలో నుంచి వెళ్లడంతో గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అర్ధరాత్రి లారీలు, ట్రాక్టర్లు ఓవర్‌ లోడ్‌తో విపరీతమైన వేగంతో గ్రామంలో వెళ్లడం ప్రమాదకరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక లారీలు కరకట్ట మీదుగానే వెళ్లాలని గ్రామంలోకి రావద్దని అభ్యంతరం తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో అక్రమ ఇసుక రవాణా కారణంగా మద్దూరు–వణుకూరు రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, నేటికీ రోడ్డు నిర్మాణం జరగలేదని తెలిపారు. కాగా పోలీసులు రంగప్రవేశం చేసి గ్రామస్తులకు నచ్చచెప్పారు. గ్రామంలోకి గురువారం నుంచి లారీలు వస్తే సహించేది లేదని గ్రామస్తులు తెగేసి చెప్పారు.



వణకూరు గ్రామస్తులు అర్ధరాత్రి ధర్నా చేస్తున్న దృశ్యం

తాడిగడప మున్సిపాలిటీలో అక్రమాలపై విచారణ

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో నాన్‌ లేఅవుట్లు, అక్రమ భవనాల నిర్మాణంపై డైరెక్టర్‌ ఆఫ్‌ టౌన్‌ ప్లానింగ్‌ అండ్‌ కంట్రీ ప్లానింగ్‌ కొరడా ఝుళిపించింది. సాక్షిలో సోమవారం వచ్చిన 'అవినీతిమేడల గడప' కథనంపై డైరెక్టర్‌ ఆఫ్‌ టౌన్‌ ప్లానింగ్‌ స్పందించారు. మున్సిపాలిటీ పరిధిలో క్షేత్రస్థాయిలో విచారించి నివేదిక ఇవ్వాలని తాడిగడప కమిషనర్‌ను ఆదేశించారు. దీంతో తాడిగడప టౌన్‌ ప్లానింగ్‌ అధికారులకు కమిషనర్‌ భవానీ ప్రసాద్‌ గురువారం ఆదేశాలు జారీ చేశారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో అక్రమ లేఅవుట్లు, అనధికార భవన నిర్మాణాలు, ప్లాన్‌ల డీవియేషన్‌లపై క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి రోజూ సచివాలయ సిబ్బంది వారి పరిధిలో తనిఖీలు చేసి నివేదిక ఎగ్జిక్యూటివ్‌ అథారిటీకి సమర్పించాలన్నారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకుంటామని, ఈ విషయంలో ఉద్యోగులు నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశాల్లో పేర్కొన్నారు.

పెసర, మినుము పంటల పరిశీలన



హనుమాన్‌జంక్షన్‌ రూరల్‌: రబీ సీజన్‌లో మినుము, పెసర వంటి అపరాల సాగు చేసే రైతులు తెగుళ్ల నివారణకు తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని తెలిపారు. బాపులపాడు మండలం వీరవల్లిలో పెసర, మినుము పంటలను గురువారం ఆమె పరిశీలించారు. ప్రస్తుత వాతావరణంలో ఉష్ణోగ్రత తక్కువగా ఉండటం, గాలిలో తేమశాతం అధికంగా ఉండటంతో మినుము, పెసర పంటలకు బూడిద తెగులు సోకే అవకాశం ఉందని చెప్పారు. తొలుత ఆకు అడుగు భాగాన తెల్లని మచ్చలు వచ్చి, ఆ తర్వాత మెల్లగా మొక్క మొత్తం వ్యాప్తి చెందుతుందని వివరించారు. దీని నివారణకు హైఫినోక్లోనోజోల్‌ 200 మిల్లీ మీటర్లు చొప్పున ఎకరాకు పిచికారీ చేయాలని ఏఓ భవాని సూచించారు.

ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లు పూర్తి

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వసంత వేణుగోపాల స్వామివారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆలయ ఈఓ సుబ్బారెడ్డి గురువారం వివరాలు తెలుపుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో శుక్రవారం ఉదయం ఐదు గంటలకు స్వామివారికి ఉత్తర ద్వారం ముందు విశేష అలంకరణ చేస్తామన్నారు. 11వ తేదీన కూడారై ఉత్సవం, శ్రీగోదారంగనాయకులకు 108 గంగాళాలతో నివేదన, మంత్రపుష్ప తీర్థప్రసాద వినియోగం ఉంటుందన్నారు. 13న భోగినాడు శ్రీగోదారంగనాయకుల స్వామివారి కల్యాణ మహోత్సవం, 14న మకర సంక్రాంతి పండుగ ఘనంగా చేస్తామని తెలిపారు.

పంచముఖ మహారుద్రయాగ చండీ మహాకుంభాభిషేకం



పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా–పార్వతీ సమేత శ్రీ చెన్నమల్లేశ్వరస్వామివారి దేవస్థానంలో గురువారం పంచముఖ మహారుద్రయాగ చండీ మహాకుంభాభిషేకం, ప్రత్యేక పూజలు ప్రారంభించారు. ఆలయంలో ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఐదు రోజుల పాటు పంచముఖ మహారుద్రయాగము, మహాకుంభాభిషేకం పూజలు బ్రహ్మశ్రీ ఎలమంచిలి కృష్ణమూర్తి శివాచార్యులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తారు.

ఎయిర్‌పోర్ట్‌కు విచ్చేసిన మాజీ సీఎం వైఎస్‌ జగన్‌



పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి

విమానాశ్రయం(గన్నవరం): తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన వారి బంధువులను, క్షతగాత్రులను పరామర్శించేందుకు వెళ్లడానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌. జగన్‌మోహన్‌రెడ్డి గురువారం గన్నవరం విమానాశ్రయానికి విచ్చేశారు. తొలుత తాడేపల్లి నుంచి రోడ్డు మార్గం ద్వారా ఆయన సాయంత్రం ఇక్కడికి చేరుకున్నారు. అనంతరం విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. తొలుత విమానాశ్రయానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన పార్టీ శ్రేణులను ఆయన ఆప్యాయంగా పలకరించారు. వైఎస్‌. జగన్‌మోహన్‌రెడ్డి రాక సందర్భంగా విమానాశ్రయంలో పోలీసులు భారీగా మోహరించడం గమనార్హం.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

హనుమాన్‌జంక్షన్‌ రూరల్‌: పట్టపగలు ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి బలవంతంగా తెంచుకుని పరారైన ఘటన హనుమాన్‌జంక్షన్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానిక విజయవాడరోడ్డులోని మూలకొట్టు సెంటర్‌ సమీపంలో నివసిస్తున్న పెరుమాళ్ల ఈశ్వరమ్మ (65) ఇంటి వద్ద కూరగాయలు కోసుకుంటుండగా ఓ వ్యక్తి వచ్చాడు. ఎవరూ అంటూ ఆరా తీస్తుండగానే ఆమె మెడలోని ఆరు కాసుల బంగారు గొలుసును బలవంతంగా లాక్కుని పరారైయ్యాడు. హఠాత్తుగా జరిగిన ఈ ఘటనతో ఆమె ఒక్కసారిగా నిర్ఘాంతపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సురేష్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

13న ముగ్గుల పోటీలు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేది ఉదయం తొమ్మిది గంటలకు సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ. 10 వేలు, ద్వితీయ బహుమతి రూ. 5 వేలు, తృతీయ బహుమతి రూ. 3 వేలు, కన్సోలేషన్‌ బహుమతుల కింద ఇరువురికి రూ. 2 వేలు చొప్పున అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ నెల 12వ తేది సాయంత్రం ఐదు గంటల్లోపు ఆలయం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

ఉయ్యూరు: గ్రామాల్లో అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని ఎంపీపీ చీలి కల్పన అన్నారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 46 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ శేషగిరిరావు, ఏఓ లోయ శివశంకర్‌, సభ్యులు పాల్గొన్నారు.

సంక్రాంతి ఉత్సవాల్లో దాతలకు అవమానం

రామవరప్పాడు: విజయవాడరూరల్‌ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 13 నుంచి సంక్రాంతి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ ఈఓ పి. ప్రియాంక ఈనెల 7న విలేకరుల సమావేశం నిర్వహించి ఉత్సవాల బ్రోచర్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ బ్రోచర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా ఉత్సవాలకు సహకరిస్తున్న దాతల పేర్లను ప్రచురించారు. కాగా దాతల పేర్లలో వైఎస్సార్‌ సీపీకి చెందిన నాయకుల పేర్లు కూడా ఉన్నాయని ఈ పేర్లను తొలగించాలన్న ఉద్దేశ్యంతో ఈ బ్రోచర్‌లో పేర్లను తొలగించి రాత్రికి రాత్రి నూతన బ్రోచర్లను ముద్రించడం వివాదానికి దారి తీసింది. మరోపక్క ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కనుసన్నల్లో ఉత్సవాల నిర్వహణకు జంబో కమిటీని రూపొందించారు. ఎన్నో ఏళ్లుగా ముందుకొస్తున్న దాతలను కాదని అవమానాలకు గురి చేయడం ఎంత వరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

విద్యుత్‌ విజిలెన్స్‌ తనిఖీలు



ఉంగుటూరు: మండలంలోని తేలప్రోలు సెక్షన్‌లో గృహాలు, వాణిజ్య సముదాయాలపై విద్యుత్‌ శాఖ విజిలెన్స్‌ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. విలేకరుల సమావేశంలో విజిలెన్స్‌ ఈఈ సీహెచ్‌ వాసు, గుడివాడ ఆపరేషన్‌ ఈఈ జీబీ శ్రీనివాస్‌ వివరాలు వెల్లడించారు. 41 బృందాలుగా ఏర్పడి 3,069 గృహాలు, 100 వాణిజ్య సముదాయాల సర్వీసులను తనిఖీ చేశారు. వాటిలో 289 సర్వీసులకు అదనపు లోడు 392 కిలో వాట్‌ మొత్తానికి రూ.7.84 లక్షలు జరిమాన విధించినట్లు వివరించారు. హనుమాన్‌ జంక్షన్‌ డీఈఈ బీ శ్రీనివాసారావు, తేలప్రోలు ఏఈ జే దుర్గారావు, గుడివాడ డివిజన్‌లోని ఏఈ, జేఈలు, లైన్‌ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో ప్రయాణికుడు ఆందోళన

విమానాశ్రయం(గన్నవరం): గన్నవరం విమానాశ్రయంలో ప్రయాణికుడి కుటుంబ సభ్యులు ఆందోళన చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన ఓ యువకుడు ఎయిరిండియా విమానంలో న్యూఢిల్లీ మీదుగా అమెరికా వెళ్లేందుకు ఉదయం విమానాశ్రయానికి చేరుకున్నారు. అయితే విమానం బయలుదేరేందుకు 45 నిమిషాలు ముందు వచ్చిన అతనికి సంబంధించిన లగేజ్‌ బ్యాగ్‌ను ఫ్లైట్‌లోకి పంపించేందుకు ఎయిరిండియా సిబ్బంది నిరాకరించారు. దీంతో సదరు ప్రయాణికుడికి, ఎయిర్‌లైన్స్‌ సిబ్బందికి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో విమానం షెడ్యూల్‌ ప్రకారం 9.10 గంటలకు న్యూఢిల్లీ బయలుదేరి వెళ్లింది. దీంతో విమానాన్ని మిస్‌ అయిన సదరు ప్రయాణికుడు, అతని తల్లిదండ్రులు, బంధువులు ఎయిర్‌లైన్స్‌ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై దురుసుగా ప్రవర్తించిన ఎయిర్‌లైన్స్‌ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎయిర్‌పోర్ట్‌ అథారిటీని కోరారు.

సబ్సిడీపై ఉద్యాన ప్యాక్‌ హౌస్‌ల నిర్మాణం

గన్నవరం రూరల్‌: ఉద్యాన పంటలు పండించిన రైతులు వాటిని భద్రపరుచుకునేందుకు ప్రభుత్వం ప్యాక్‌ హౌస్‌లను సబ్సిడీపై మంజూరు చేస్తుందని మండల హార్టీకల్చర్‌ అధికారి ఇ.హరిచంద్‌ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రూ.4లక్షలు ఖర్చు అయ్యే నిర్మాణానికి రూ. 2లక్షలు సబ్సిడీపై అందజేస్తుందన్నారు. పొడవు 30అడుగులు, వెడల్పు 20 అడుగులు, ఎత్తు 15 అడుగులతో ఈ ప్యాక్‌ హౌస్‌ను రైతులు నిర్మించుకోవాలన్నారు. ఆసక్తి ఉన్నవారు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

ఆనందోత్సాహాలతో సంక్రాంతి సంబరాలు

కంకిపాడు: ఆనందోత్సాహాల నడుమ ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్‌ వసంత క్యాంపస్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు వెలిగించారు. హరిదాసుల భక్తిగీతాల ఆలాపనలు, పాల పొంగళ్లు, అందమైన రంగవల్లులతో సంబరాలు సాగాయి. పునాదిపాడు యూనియన్‌ బ్యాంకు మేనేజర్‌ యు.ఉమాదేవి, నలంద విద్యాసంస్థల సీఏసీ ఎల్‌.సుధారాణి, పాఠశాల ప్రిన్సిపాల్‌ పి.నాగలక్ష్మి తల్లిదండ్రులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రారంభించారు. రంగవల్లులు ఆంధ్రా వంటకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

నున్న(విజయవాడరూరల్‌): స్థానిక వెస్ట్‌ మండల పరిషత్‌ ఎలిమెంటరీ స్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. విద్యార్థులు ఆనందంతో సంబరాల్లో పాల్గొన్నారు. కట్టెల పొయ్యి మీద పొంగలి, పాయసం తయారు చేసుకొని అందరూ కలిసి ప్రేమ విందు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనుల పండువగా సంబరాలు

ఉయ్యూరు: సంక్రాంతి సంబరాలు ఉయ్యూరులో గురువారం కనుల పండువగా సాగాయి. ఎంకే గ్రూప్‌ విద్యాసంస్థల్లో సాంస్కృతిక, పొట్టేళ్ల ప్రదర్శనలు నిర్వహించారు. గంగిరెద్దుల విన్యాసాలు, పిండి వంటల తయారీ, వడ్లు పోత, విద్యార్థుల పల్లె వేషధారణలు అబ్బురపరిచాయి. మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్‌, మున్సిపల్‌ చైర్మన్‌ వల్లభనేని సత్యనారాయణ, విద్యాసంస్థల అధినేత ఎంకే బాబు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌ రూరల్‌: స్థానిక నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. చిన్నారులకు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి భోగి పళ్లు పోసి ఆశీస్సులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటనాగేశ్వరరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌ సుంకర సుభాష్‌చంద్రబోస్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే బాపులపాడు మండలం వీరవల్లిలో మమతల పందిరి సేవా సమితి, నెహ్రూ యువజన కేంద్రం (విజయవాడ) ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

పెనమలూరు: పెనమలూరులో గురువారం సంక్రాంతి సంబరాలు చేశారు. వికాస్‌ మోడల్‌ స్కూల్‌లో మహిళలు, చిన్నారులు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు.

మద్దూరులో భోగిపండ్ల మహోత్సవం

కంకిపాడు: మండలంలోని మద్దూరు మండల పరిషత్‌ పాఠశాలలో చిన్నారులకు భోగి పండ్ల మహోత్సవం చేశారు. అలాగే హెచ్‌ఎం ఎం.స్వప్నకుమారి సేకరించిన దేశ, విదేశీ నాణేలు, కరెన్సీ, స్టాంపులను ప్రదర్శించారు. ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్‌ ప్రదర్శనను తిలకించి హెచ్‌ఎం స్వప్నకుమారిని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ చిప్పల రామదాసు, ఎంపీటీసీ వడుగు శ్రీనివాసరావు, కాసరనేనివారిపాలెం సర్పంచ్‌ పి.వరప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్‌ మండలం రామవరప్పాడు ఆక్స్‌ఫర్డ్‌ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. రంగవల్లులు, పిండివంటలు, భోగిమంటలు, హరిదాసు కీర్తనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణలో విద్యార్థులు బొమ్మల కొలువు, గొబ్బెమ్మలు, భోగి మంటలు, కోలాటాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి పాల్గొన్నారు. ప్రిన్సిపాల్‌ పద్మావాణి, రెడ్‌ హౌస్‌ ఇన్‌చార్జి ఈడ్పుగంటి భవాని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో పొట్టేళ్ల ప్రదర్శన



భోగి మంటలు వెలిగించి సందడి చేస్తున్న మమతల పందిరి సేవా సమితి సభ్యులు



రామవరప్పాడు ఆక్స్‌ఫర్డ్‌ పాఠశాలలో హరిదాసు వేషధారణలో చిన్నారి



నున్న సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు